

- యథేచ్ఛగా గ్రానైట్ అక్రమ రవాణా
- గ్రామస్థులకు పట్టుబడినా సక్రమంగా నడవని విచారణ

అయినా ఆగలేదు!

కుప్పంలో కొండలు, గుట్టలు కరుగుతున్నాయి. ప్రస్తుతం ఏ క్వారీకీ అనుమతులు లేకపోయినా, గ్రానైట్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గ్రామస్థులే పట్టుకుంటే తప్ప రవాణాను అడ్డుకునేవారే లేకుండా పోయారు. ధైర్యంగా ముందుకొచ్చి గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించినా, విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి మైనింగ్ శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. ఎక్కడ ఏమి జరుగుతున్నదో కానీ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమంగా నడిచిన క్వారీల్లోని గ్రానైట్ బండలు రాత్రికి రాత్రే మాయమైపోతున్నాయి. కుప్పంలో కేవలం వారం రోజుల వ్యవధిలోనే జరిగిన రెండు సంఘటనలు దీనికి తాజా ఉదాహరణ.

- కుప్పం



ఊరినాయనిపల్లె అక్రమ క్వారీ వద్ద తవ్విలేపిన బండలు

కుప్పం మండలం గుడ్లనాయనిపల్లె పంచాయతీ ఊరినాయనికొత్తూరు వద్ద అనధికారికంగా గుట్టను చదును చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంనుంచి మొదలైన ఈ క్వారీయింగ్ ఇప్పుడూ కొనసాగుతోంది. ఇక్కడినుంచి క్వారీ బండలను తమిళనాడుకు తరలించడం నిత్యకృత్యంగా మారుతోంది. సమీప గ్రామస్థులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీంతో చివరకు గ్రామస్థులే నడుం బిగించారు. అక్రమ క్వారీ వద్ద రెండు లారీలకు గ్రానైట్ బండలు లోడ్ చేస్తుండగా సోమవారం సాయంత్రం గ్రామస్థులు దాడిచేసి అడ్డుకున్నారు. అందులో ఒక లారీకి అప్పటికే లోడ్ కాగా, ఇంకో లారీకి లోడింగ్ జరుగుతోంది. ఆ సమయంలో గ్రామస్థులు వెళ్లేసరికి డ్రైవర్లతోపాటు వారితో ఉన్న ఒకరిద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించడానికి ప్రయత్నించారు. గ్రామస్థులు తిరగబడేసరికి, డ్రైవర్లు వాహనాలు వదిలి పారిపోయారు. పోలీసులకు సమాచారం ఇవ్వగానే వాళ్లు వచ్చి లోడింగ్ పూర్తయిన లారీని సీజ్ చేసి ఆర్టీసీ డిపో ఆవరణలో ఉంచారు. వీటిని పరిశీలించి పర్మిట్లు ఉందా లేదా, అక్రమమా సక్రమముగా తేల్చాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులది. అయితే సోమవారం రాత్రి క్వారీ లారీలు పట్టుబడితే, మంగళవారం రాత్రి దాకా మైనింగ్ అధికారులు ఇటువైపు తొంగి చూడలేదు. కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడును వివరణ కోరగా, మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చి నిజానిజాలు నిగ్గు తేలుస్తారని చెప్పారు. సాయంత్రం భూగర్భ గనుల శాఖ పలమనేరు ఏడీ వేణుగోపాల్‌ను వివరణ కోరగా, గ్రానైట్ లారీలు పట్టుబడ్డ సమాచారమే తమకు లేదని చెప్పారు.

ఈనెల 7న కూడా..

నడిమూరు చెక్‌పోస్టు వద్ద బెంగళూరునుంచి తమిళనాడు తరలుతున్నట్లుగా పర్మిట్ ఉన్న ఓ గ్రానైట్ లారీ ఈనెల 7వ తేదీన పట్టుబడిన విషయం తెలిసిందే. ఆ వాహనం మీద 'ఎంఎల్ఆర్, పుంగనూరు' అని రాసి ఉంది. గ్రానైట్ లారీ ముందుగా ఎస్కార్టుగా ఒక కారు ప్రయాణించింది. అయినా సరే మైనింగ్ అధికారులు గ్రానైట్ రవాణా సక్రమమేనని వదిలేయడం గమనార్హం.



ఆర్టీసీ డిపో వద్దనున్న పోలీసులు సీజ్ చేసిన గ్రానైట్ లారీ

గ్రానైట్ రవాణా వెనుక ఏం జరుగుతోంది?

కుప్పం మండలంలోని కృష్ణదాసనపల్లె వద్ద అధికారంలో ఎవరు ఉన్నారన్నదానికి అతీతంగా ఎప్పటినుంచో గ్రానైట్ క్వారీ నడుస్తోంది. టీడీపీ ప్రభుత్వం వచ్చాక, అనుమతులు రద్దయ్యాయి. అయినా సరే, ఇక్కడినుంచి యథేచ్ఛగా గ్రానైట్ అక్రమంగా రవాణా అవుతున్నదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈనెల 7వ తేదీన పట్టుబడి వదిలేసిన గ్రానైట్ లారీ ఈ క్వారీనుంచే బయలుదేరిందన్న అనుమానాలను పలువురు ఇప్పటికీ వ్యక్తం చేస్తున్నారు. కుప్పం మండలం పైపాళ్యం గ్రామస్థుడు ఒకరి లారీని గ్రానైట్ రవాణాకు వాడడంతోపాటు డ్రైవర్ కూడా అదే గ్రామానికి చెందినవాడు కావడం ఈ అనుమానాలకు ప్రధాన కారణం. మరోవైపు సోమవారం రాత్రి పట్టుబడ్డ లారీ ఊరినాయనిపల్లె కొత్తూరు గ్రామ సమీపంలో గల క్వారీవద్ద ఉన్నది. ఇక్కడ అసలు క్వారీకి ఇప్పుడు కాదుకదా, గతంలో ఎప్పుడూ అనుమతులు లేవు. ఈ క్వారీ విషయం, స్థానిక రెవెన్యూ, పోలీస్, చివరకు పలమనేరులో కార్యాలయంగల మైనింగ్ శాఖ అధికారులకు కూడా తెలుసు. అయినా చర్యలు లేవు. గ్రానైట్ లారీని రెడ్ హ్యాండెడ్‌గా గ్రామస్థులు పట్టుకుని, పోలీసులకు అప్పగించి 24 గంటలు గడిచినా పోలీసు, మైనింగ్ శాఖాధికారులు ఒకరిమీద ఒకరు చెప్పుకోవడం తప్ప, చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలను తావిస్తోంది. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష రాజకీయాలు కలగలసిపోయిన ఒక వ్యవస్థ గ్రానైట్ అక్రమ రవాణాను శాసిస్తున్నదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వెంటనే జిల్లా అధికార యంత్రాంగం కదిలి, గ్రానైట్ అక్రమ కార్యకలాపాలను అడ్డుకోకపోతే ప్రభుత్వంతోపాటు, అధికార పార్టీకి కూడా ప్రజల్లో చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉంది.



ఊరినాయనిపల్లె క్వారీ వద్ద వాహనాల రాకపోకలు సాగినట్లు సూచించే టైర్ల గుర్తులు



కృష్ణదాసనపల్లెలోని ఈ క్వారీ నుంచీ సాగుతున్న అక్రమ రవాణా

పేదల కడుపు చల్లగా..!

- రూ.5కే తీరనున్న ఆకలి
- 15న అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు ప్రభుత్వ నిర్ణయం



రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరులో పునఃప్రారంభమైన అన్న క్యాంటీన్

చిత్తూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కూల్చడం, కక్ష కట్టి వేధించడమే లక్ష్యంగా ఐదేళ్లు పాలించింది. అందులో భాగంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లను కొనసాగిస్తే చంద్రబాబుకు మంచి పేరు వస్తుందని ఎత్తేసింది. రూ.5కే కడుపు నిండా భోజనం చేసే పేదవాడి కడుపు మాడ్చింది. టీడీపీ కూటమి తిరిగి అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ మీద దృష్టి పెట్టింది. ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ప్రారంభించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోనూ అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి.

- కుప్పం కోర్టు సమీపంలో గత టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను వైసీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేసింది. అక్కడ కుప్పం మున్సిపాలిటీకి చెందిన వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఆ సచివాలయాన్ని ఇతర ప్రాంతానికి మార్చేసి మళ్లీ అదే ప్రాంతంలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తోంది. ఈ మేరకు ఇక్కడ అన్ని పనులూ పూర్తయ్యాయి.
- పలమనేరు బస్టాండు సమీపంలో టీడీపీ ప్రభుత్వం రూ.30 లక్షలతో క్యాంటీన్‌ను నిర్మించింది. వైసీపీ ప్రభుత్వం అన్నిచోట్లలాగే ఇక్కడా దాన్ని మూసేసింది. ఐదేళ్లుగా ఆ భవనం ఖాళీగానే ఉండిపోయింది. ఇప్పుడు మళ్లీ రూ.13 లక్షలతో మరమ్మతులు చేసి.. 15వ తేది ప్రారంభానికి సిద్ధం చేశారు.
- పుంగనూరులోని జడ్పీ గెస్ట్ హౌస్ ఆవరణలోని అన్న క్యాంటీన్ భవనాన్ని.. వైసీపీ అధికారంలోకి వచ్చాక మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంగా మార్చేశారు. తాజాగా, టీడీపీ ప్రభుత్వం దాన్ని బైపాస్‌లోని ఓ భవనంలోకి మార్చి, మళ్లీ అదే ప్రాంతంలో క్యాంటీన్‌ను ప్రారంభించనుంది. ఈ మేరకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.
- నగరి సంతమైదానంలోని అన్న క్యాంటీన్ భవనాన్ని వైసీపీ హయాంలో మున్సిపల్ శానిటేషన్ ఆఫీస్‌లా వాడుకుంది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అదే భవనంలో క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తోంది.

చిత్తూరులో రెండు నెలల కిందటే..

రాష్ట్రంలోనే అన్న క్యాంటీన్‌ను తొలుత చిత్తూరులో పునఃప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దీనిని మార్చేసి.. జూన్ 17న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యాన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. కొంగారెడ్డిపల్లెలోని ఈ క్యాంటీన్ భవనంలో గతంలో వార్డు సచివాలయాన్ని నిర్వహించేవారు.

ప్రతిపక్షంలో ఉండీ క్యాంటీన్ల నిర్వహణ

కక్ష కట్టి వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసేస్తే.. టీడీపీ ప్రతిపక్షంలో ఉండి కూడా జిల్లాలో అన్న క్యాంటీన్లను నిర్వహించింది. చిత్తూరు, కుప్పం, బంగారుపాళ్యం, గుడిపాల, జీడీనెల్లూరు వంటి ప్రాంతాల్లో స్థానిక నాయకులు కలిసి అన్న క్యాంటీన్లను నిర్వహించి పేదల ఆకలి తీర్చారు. రెండేళ్ల కిందట కుప్పం బస్టాండు సమీపంలో టీడీపీ నాయకులు సొంత డబ్బుతో క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. తెల్లారి చంద్రబాబు ప్రారంభించనుండగా.. వైసీపీ నాయకులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. అయినా అన్న క్యాంటీన్‌ను టీడీపీ నేతలు కొనసాగిస్తూ వచ్చారు.



పలమనేరులో ప్రారంభానికి సిద్ధంగా..

పుంగనూరులో భారీ వర్షం



పుంగనూరులో నీట మునిగిన ఎగ్జిబిషన్ పరికరాలు

చిత్తూరు కలెక్టరేట్/పుంగనూరు, ఆగస్టు 13: అల్పపీడన ద్రోణి ప్రభావ కారణంగా గడచిన 24 గంటల్లో జిల్లాలోని 27 మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా పుంగనూరులో 90.4, అత్యల్పంగా చిత్తూరులో 1.0 మిమీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో పుంగనూరులోని ఆర్టీసీ బస్టాండు వెనుక 10 రోజులుగా ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ పరికరాలు నీట మునిగాయి. మహారాష్ట్రకు చెందిన సుమారు 30 కుటుంబాలు ఎగ్జిబిషన్ నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో వర్షంతో పనులు ఆగాయి. పనులు జరగకపోవడంతో ఆకలితో ఇబ్బందులు పడుతున్నట్లు వలస కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, మండలాలవారీగా పూతలపట్టులో 59.8, తవణంపల్లెలో 52.2, చౌడేపల్లెలో 38.6, కార్వేటినగరంలో 30.4, గంగాధరనెల్లూరులో 27.4, బంగారుపాళ్యంలో 26.0, పెనుమూరులో 25.0, గుడుపల్లెలో 24.4, శాంతిపురంలో 22.6, బైరెడ్డిపల్లెలో 22.2, రామకుప్పంలో 18.2, కుప్పంలో 18.0, పలమనేరులో 16.4, సోమలలో 14.6, ఐరాలలో 13.4, పులిచెర్లలో 13.0, గంగవరంలో 12.2, వి.కోటలో 12.0, చిత్తూరు రూరల్‌లో 11.4, పెద్దపంజాణిలో 6.4, గుడిపాలలో 4.8, రొంపిచెర్లలో 3.4, వెదురుకుప్పంలో 3.4, సదుంలో 3.2 మి.మీ చొప్పున వర్షం కురిసింది. ఆగస్టు నెల సగటు జిల్లా వర్షపాతం 122.1 మి.మీ. కాగా, మంగళవారం వరకు 112.6 మిమీ వర్షం కురిసింది.

రెవెన్యూ సదస్సులు వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13: జిల్లాలోని 822 గ్రామ, 39 వార్డుల్లో ఈనెల 16వ తేది నుంచి నిర్వహించ తలపెట్టిన రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం వాయిదా వేసింది. సెప్టెంబరు మొదటి వారం నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయిన తర్వాత రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ సదస్సు వాయిదాపై తమకు అధికారికంగా ఎలాంటి ఆదేశాలు అందలేదని రెవిన్యూశాఖ ముఖ్య అధికారి తెలిపారు.

మళ్లీ తహసీల్దార్ల బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13: జిల్లాలో పలువురు తహసీల్దార్లను పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం చిత్తూరు రూరల్ తహసీల్దార్‌గా నియమితులైన ఎం. లోకేశ్వరిని పెనుమూరుకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ బి. కళ్యాణి విధులు నిర్వహిస్తున్నారు. అన్నమయ్య జిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు బదిలీపై వచ్చిన రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ కేవీపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఆయన్ను రొంపిచెర్లకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

రిజిస్ట్రేషన్‌శాఖ రికార్డు రూమ్ పరిశీలన



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13: జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ రికార్డు రూమ్‌ను మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని అగ్ని ప్రమాద సంఘటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇతర విలువైన పత్రాల భద్రతపై దృష్టిపెట్టింది. జిల్లాలోని ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రస్తుతమున్న స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. డాక్యుమెంట్ల భద్రతపై ఏర్పాటుచేసిన కమిటీ సభ్యులైన ట్రాన్స్‌కో డీఈ శేషాద్రి, ఏఈ కేశవులు, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ వినోద్ తదితరులు రికార్డురూమ్‌ను పరిశీలించారు. రికార్డు రూమ్‌కు సరఫరా అవుతున్న విద్యుత్ వైర్లను వెంటనే మార్పుచేయాలని ట్రాన్స్‌కో డీఈ సూచించారు. రిజిస్ట్రేషన్ శాఖ ఎస్‌ఏ మేనక తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి అడుగుల జెండా



వెయ్యి అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

జాతీయ జెండాతో స్కేటింగ్ చేస్తూ..

చిత్తూరులో మంగళవారం వెయ్యి అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు జాతీయత ర్యాలీ నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు కొంగారెడ్డిపల్లి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చారు. విగ్రహం చుట్టూ మానవహారంగా జెండాతో విద్యార్థులు నిలబడ్డారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో పలువురు ఆకట్టుకున్నారు.

- ఇక, విద్యార్థులు, క్రీడాకారులతో గాంధీ విగ్రహం నుంచి పీసీఆర్ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ కొనసాగింది. చిన్నారులు జాతీయ జెండాను చేతపట్టి స్కేటింగ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ వెంట వెళ్లడం ఆకట్టుకుంది.

- చిత్తూరు (సెంట్రల్)



గాంధీ విగ్రహం చుట్టూ జాతీయ జెండాతో విద్యార్థుల మానవహారం

ఇంటింటా జెండా ఎగురవేయాలి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతి సమైక్యతను చాటుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆకాంక్షించారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వెయ్యి అడుగుల జెండాతో చిత్తూరులో ర్యాలీ నిర్వహించారు. తెలుగుతల్లి, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో 'కేశవరెడ్డి' విద్యార్థులు అలరించారు. అక్కడి నుంచి జన జాగృతి సమితి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ సంతపేట లిల్లీ బ్రిడ్జ్ వరకు సాగింది. సంతపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ దేశ సమగ్రత, జాతీయతను కాపాడేలా విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల మనోభావాలను అలవర్చుకోవాలని సూచించారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుని వారి అడుగు జాడల్లో నడవాలని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్, ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి అఖిల్, బీజేపీ నాయకులు చిట్టిబాబు, రామభద్ర , నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ప్రదీప్, ధనుష్కోటి, జ్యోతిష్, పునీత్, విద్యార్థులు పాల్గొన్నారు.

- పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అధ్యక్షతన 'భవిష్యత్ భారత్ నిర్మాణంలో యువత పాత్ర' అంశంపై వ్యాసరచ, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎన్‌పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఉద్యమంలో తెలుగువారైన పింగళి వెంకయ్య పాత్ర ఎనలేనిదని కొనియాడారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.





స్వాతంత్ర సమరయోధులు, భారతమాత వేషధారణలో విద్యార్థులు - సంతపేట హైస్కూల్ నుంచి ర్యాలీ..

దేశ సమగ్రతపై అవగాహన పెంచుకోండి

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 13: దేశ సమగ్రత, సమైక్యత, జాతీయవాదంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భాగంగా మంగళవారం విద్యార్థులు, క్రీడాకారుల ర్యాలీని చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద ఆయన ప్రారంభించారు. ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా పీసీఆర్ జూనియర్ కళాశాల వరకు సాగిన ర్యాలీలో కొందరు చిన్నారులు జాతీయ జెండాను చేతపట్టి స్కేటింగ్ చేస్తూ పాల్గొన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని కలెక్టర్ కోరారు. బుధవారం పాఠశాలలు, కళాశాలల్లో జాతీయతను ఉద్దేశించి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 15న మంత్రి సత్యకుమార్ యాదవ్ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారన్నారు. ర్యాలీలో క్రీడాధికారి బాలాజీ, జిల్లా యూత్ వెల్ఫేర్ అధికారి ప్రదీప్, పీడీ బాబు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల నియామకం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారిని ఆయా జిల్లాలకు నియమిస్తూ హైకోర్టు విజిలెన్సు రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీకాళహస్తిలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జి.ధర్మారావును అనకాపల్లి మొదటి తరగతి జ్యుడిషియల్ న్యాయమూర్తిగా నియమించారు. కొత్తగా సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారిలో తిరుపతికి చెందిన పల్లెపాగు ప్రశాంత్‌ను మాచర్ల అదనపు మొదటి తరగతి న్యాయమూర్తిగా, చిత్తూరుకు చెందిన ఎం.రోహిత్‌ను విశాఖ జిల్లా నర్సీపట్నం అదనపు మొదటి తరగతి న్యాయమూర్తిగా, చిత్తూరులో స్పెషల్ మొబైల్ కోర్టు, ఐదో అదనపు సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కీర్తనను మదనపల్లె రెండో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తిగా నియమించారు.

తిరుమలలో వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి

తిరుమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సినీహీరో వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని భాస్కర్‌భవన్ విశ్రాంతి భవనానికి చేరుకున్న వీరికి స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. వీరు బుధవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.



అతిథిగృహంలోకి వెళుతున్న వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి

108లో సుఖప్రసవం



పూతలపట్టు, ఆగస్టు 13: 108 వాహనంలో ఓ గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చింది. పాకాలకు చెందిన ఆయేషా పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబీకులు ఆమె ను మంగళవారం సాయంత్రం పి. కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా ఆమె ప్రసవించింది.

ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తిచేయండి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13: రెవెన్యూశాఖతో వ్యవసాయశాఖ సమన్వయం చేసుకుని ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జరిగిన సమీక్షాసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యం పరికరాల పంపిణీకి సంబంధించి ఈ ఏడాది 21వేల హెక్టార్ల లక్ష్యంలో వంద రోజులో 3500 హెక్టార్ల లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. 20శాతం కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయని అధికారులు ఇకనైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖలకు సంబంధించిన జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, ఉద్యానవనశాఖ జేడీ మధుసూదన్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు ఏర్పాట్లు పూర్తిచేయండి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13: స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దిన వేడుకలకు 24 గంటల్లోగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ప్రశాంత్‌నగర్‌లోని పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మణికంఠతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పతాకావిష్కరణకు వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరవుతారని చెప్పారు. పరేడ్ మైదానంలో డయాస్, స్టేజ్ డెకరేషన్, ప్రొటోకాల్ మేరకు పకడ్బందీగా చేయాలని ఆర్డీవో శివయ్యను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ అరుణకు సూచించారు. శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అడిషినల్ ఎస్పీ అరీఫుల్లా, డ్వామా పీడీ రాజశేఖర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



పరేడ్ మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

'గల్లా' ఇంట్లో గ్రంథాలయం



సాకం నాగరాజును సన్మానిస్తున్న గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి

తవణంపల్లె, ఆగస్టు 13: మాజీ మంత్రి గల్లా అరుణకుమారి సొంతూరు తవణంపల్లె మండలం దిగువమాఘంలోని తమ ఇంట్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజ, డాక్టర్ గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారితో కలిసి దీనిని ప్రారంభించారు. పుస్తకం ఇచ్చే స్ఫూర్తిని టీచర్ కూడా ఇవ్వలేడని, పుస్తకం గురువును మించిందని ఈ సందర్భంగా గల్లా అరుణ అన్నారు. పుస్తకాలు మన ఐశ్వర్యమని, ఇంటింటా పుస్తకాల ర్యాక్ ఉండాలని సాకం నాగరాజ అన్నారు. కార్యక్రమంలో రచయితలు నామిని సుబ్రమణ్యం నాయుడు, అరుణకుమారి, మౌని, పేరూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. రాజాచంద్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్, చిత్తూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సహదేవ నాయుడు, అరసం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గంటా మోహన్, పత్తిపాటి రమేష్‌నాయుడు, ధర్మయ్య, బాలకృష్ణారెడ్డి, ముని హాజరయ్యారు.

సచివాలయానికి తాళం

పరిహారం కోసం రైతు కుటుంబం చర్య ● సమస్య పరిష్కారానికి అధికారుల హామీ

వి.కోట, ఆగస్టు 13: వి.కోట మండలం జవ్వునిపల్లె సచివాలయానికి మంగళవారం ఉదయం ఓ రైతు కుటుంబం తాళం వేసింది. ప్రభుత్వ అవసరాలకు ఇచ్చిన భూములకు పరిహారం చెల్లించాలంటూ సోమశేఖర్ కుమారుడు అజయ్‌కుమార్ తాళం వేశారు. సచివాలయాల నిర్మాణ సమయంలో జవ్వునిపల్లెకు వెళ్ళే దారిలో ఉన్న సోమశేఖర్‌కు చెందిన సర్వే నంబరు 572 లోని డీకేటీ పొలాన్ని ప్రభుత్వ అవసరాల కోసం తీసుకున్నారు. అందుకు ప్రతిఫలంగా అప్పటి వైసీపీ పెద్దలు వాళ్ళ ఇంట్లో ఒకరికి ఉద్యోగం, జగనన్న కాలనీలో రెండు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. వారి గ్రామంలో కాకుండా మావత్తూరు కాలనీలో ఇంటిస్థలం ఇచ్చేందుకు ప్రయత్నించడంతో వారు అంగీకరించలేదు. ఆపై వి.కోట పట్టణంలో ఇంటి స్థలం ఇస్తామని తెలిపారు. ఏళ్ళు గడుస్తున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన సోమశేఖర్, అతడి కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం సచివాలయం వద్దకు చేరుకుని సిబ్బందిని బయటకు పంపి తాళం వేశారు. సమాచారం అందుకున్న డీటీ బాలాజీ, ఆర్ఐ మోహన్‌రెడ్డి సచివాలయం వద్దకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పారు. తాళం వేయడం సబబు కాదని ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వారిచేతే తాళాలను తీయించారు. భూమికి సంబంధించి పరిహారం రాకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. సమ్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



జవ్వునిపల్లె సచివాలయానికి తాళం వేసిన భూయజమానులు

కాణిపాక ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వాణి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 13: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా కె.వాణి మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆమె వరసిద్ధుడి ఆలయంలో డిప్యూటి ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గత ఈవో వెంకటేశు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన్ను తన మాతృ సంస్థకు బదిలీ చేసిన విషయం విదితమే. ఆలయ పాలన కోసం ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వాణికి బాధ్యతలు అప్పగించారు. త్వరలో రెగ్యులర్ ఈవోను నియమించనున్నారు. ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వాణిని ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న వాణి

టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై కసరత్తు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 13: జిల్లా కలెక్టర్ ఆదేశాలతో త్వరలో చేపట్టే వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై విద్యాశాఖ అధికారులు మంగళవారం కసరత్తు చేపట్టారు. నగరి డివిజన్ పరిధిలో డీఈవో దేవరాజు, చిత్తూరు, కుప్పం డివిజన్ పరిధిలో డీవైఈవో చంద్రశేఖర్, పలమనేరు డివిజన్ పరిధిలో ఏడీ వెంకటేశ్వరరావులు ప్రక్రియలో పాల్గొన్నారు. సీనియారిటీ జాబితా ఆధారంగా జూనియర్లను మిగులుగా గుర్తించారు. త్వరలో ఉద్యోగ విరమణ చెసేవారిని, వితంతు, 70 శాతం వైకల్యం, ఒంటరి మహిళ, విడాకులు తీసుకున్నటువంటి విభాగాలను ప్రక్రియ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు.

గంజాయి కేసులో భార్యాభర్తల అరెస్టు



అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డి

పలమనేరు, ఆగస్టు 13: పలమనేరు ప్రాంతం లో గంజాయి విక్రయించేందుకు అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట నుంచి వచ్చిన భార్యాభర్తలు శంకర(36), ఆదెమ్మ(26)ను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ సురేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 9.340 కిలోల గంజాయిని విక్రయించేందుకు గంగవరం సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద వేచి ఉన్నట్లు సమాచారం వచ్చింబది. అక్కడికి సిబ్బందితో వెళ్లి శంకర, ఆదెమ్మను అరెస్టు చేసి రూ.లక్ష విలువ చేసే 9.340 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ తెలిపారు.ఈ దాడుల్లో తనతో పాటు ఎస్ఐ దత్తాత్రేయ, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేసు, దేవరాజులు,క్రిష్ణమాచారి,విజయకుమార్,కానిస్టేబుళ్లు పాల్గొన్నారన్నారు.

మొగిలీశ్వర్ హత్యకేసులో నిందితురాలి అరెస్టు



నిందితురాలి అరెస్టు చూపుతున్న సీఐ చంద్రశేఖర్

పలమనేరు, ఆగస్టు 13: పలమనేరులో సంచలనం సృష్టించిన మొగిలీశ్వర్(55) హత్యకేసులో నిందితురాలు దేవరశెట్టి మంగమ్మ(49)ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్టు సీఐ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం... పలమనేరు కాకాతోపులో నివాసం ఉంటున్న మొగిలీశ్వర్, గంగవరం మండలం యామనపల్లికి చెందిన మంగమ్మతో సహజీవనం సాగిస్తున్నారు. పలమనేరు లక్ష్మీనగర్ కాలనీలో నాలుగేళ్లుగా వీరిద్దరూ ఉంటున్నారు. తన భార్య భారతి, పిల్లలను పట్టించుకోకుండా సంపాదనంతా మంగమ్మకే మొగిలీశ్వర్ ఖర్చుపెట్టేవాడు. మద్యానికి బానిసైన ఇతడు తరచూ అనుమానంతో మంగమ్మను కొట్టి వేధించేవాడు. ఇరుగుపొరుగు వారు మంగమ్మను మందలించేవారు. దీంతో మొగిలీశ్వరయ్యను అంతం చేస్తేకానీ తనకు ఈ బాధలు ఉండవని భావించిన మంగమ్మ.. ఈనెల 11వతేది రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇంట్లోకి వచ్చిన మొగిలీశ్వరయ్యను చాకుతో పొడిచింది. తీవ్ర రక్తస్రావంతో అతడు చనిపోయాడు. విషయం తెలుసుకొన్న మొగిలీశ్వరయ్య భార్య భారతి తన భర్తను మంగమ్మ చాకుతో పొడిచి చంపినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలైన మంగమ్మను అరెస్టుచేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించిందన్నారు. దీంతో ఆమెను మదనపల్లె సబ్‌జైలుకు పంపినట్లు చెప్పారు.

అమెరికా అబ్బాయి...తెలుగమ్మాయి

చిత్తూరు రూరల్, ఆగస్టు 13: ప్రేమకు కులం, మతం, భాష, దేశం అడుకాదని నిరుపించింది ఈ జంట. చిత్తూరు నగరానికి చెందిన దయాసాగర్‌రెడ్డి, లావణ్యల కుమార్తె మంజుశ్రీ. ఈమె 2018లో ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లింది. అక్కడే మైఖేల్ జాక్‌మెన్ అనే అబ్బాయితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమకు దారితీసింది. మతం,దేశం వేరయినా ఇరువురు కలిసి తల్లిదండ్రులను పెళ్లికి ఒప్పించారు. అబ్బాయి కుటుంబ సభ్యులను చిత్తూరుకు రప్పించి మంగళవారం రిసెప్షన్ నిర్వహించారు. .వీరికి బుధవారం పెళ్లి జరగనునుంది.



ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు



బైరెడ్డిపల్లె, ఆగస్టు 13: బైరెడిడపల్లె మండలం గొల్లచీమనపల్లె గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ నవీన్‌కుమార్‌కు మంగళవారం కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీటివీడ్కోలు పలికారు. అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. గుండెపోటుతో ఈయన మృతిచెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం ఆర్మీఅధికారులు నవీన్‌కుమార్ మృతదేహాన్ని గొల్లచీమనపల్లెకు తీసుకొచ్చి కుటుంబీకులకు అప్పగించారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, తహసీల్దార్ మాధవరాజు, వివిధశాఖల సిబ్బంది, గ్రామస్తులు నవీన్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబీకులను పరామర్శించారు.

నెల్లూరు కల నెరవేరింది

షార్ సందర్శనపై పవన్ కల్యాణ్

సూళ్లూరుపేట, ఆగస్టు 13 : నెల్లూరులో చదువుకునే రోజుల్లో శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగాలు చేపడతారని తెలిసి అక్కడికి వెళ్లాలనుకున్నా.అయితే శాస్త్రవేత్తలుంటారు కాబట్టి భారీ భద్రతా ఏర్పాట్లుంటాయి కాబట్టి వెళ్లలేమలే అనుకునే వాడిని.అయితే ఈ రోజు యాధృచ్ఛికంగా అంతరిక్ష దినోత్సవానికి హాజరై షార్ సందర్శించడడమనే కల నెరవేరింది.... అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు.ఎవరైనా మంచిని బలంగా కోరుకుంటే అది తప్పకుండా నెరవేరుతుందనేది తన విషయంలో నిజమైందన్నారు. షార్‌లో మంగళవారం జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని కురుప్ ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలన చేసి అంతరిక్ష దినోత్సవాలను ప్రారంభించారు.అనంతరం షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒకప్పుడు 40 వేల ఎకరాల చిట్టడవిలో ఉన్న శ్రీహరికోట నేడు దేశానికే తలామానికంగా మారిందంటే అది శాస్త్రవేత్తల ఘనతేనని తెలిపారు.అంతరిక్షంలోకి మనిషిని పంపడం మన ముందున్న సవాల్ అని అది కూడా శ్రీహరికోట నుంచి పంపించేందుకు సన్నాహాలు చేయడం శుభపరిణామమన్నారు. ఇస్రో పరిశోధనలకు, కార్యక్రమాలకు ఏపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్నారు. ఏపీ యువతలో అపరిమితమైన జిజ్ఞాస వుందని, దాన్ని సరైన రీతిలో ముందుకు తీసుకెళ్ళే దారి లేక యువత ప్రత్యామ్నాయాల వైపు చూస్తోందన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరముందన్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల ఫలాలు సామాన్యులకు సైతం అందినపుడే నిజమైన విజయమన్నారు. అందులో భాగంగానే అంతరిక్ష పరిశోధనల గురించి గ్రామీణ యువతకు సైతం తెలియజేసేందుకు ఇస్రో ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నోఏళ్ల కలను చంద్రయాన్-3 విజయంతో నెరవేర్చుకొన్నామని, ఇది దేశానికి కానుకగా ఇస్రో ఇచ్చిన భారీ విజయమన్నారు. 2023వ సంవత్సరం ఆగస్టు 23న చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ అయిన రోజును భారత ప్రభుత్వం అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా సంబరాలు చేసి మారుమూల గ్రామాలకు సైతం అంతరిక్ష పరిశోధనలు తీసుకెళ్లడం మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల భావి తరాలకు ఎంతో ఉపయోగమన్నారు.అంతరిక్ష దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పవన్ కల్యాణ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.పవన్‌కు అధికారులు చంద్రయాన్ 3 రాకెట్ నమూనాను బహుకరించారు.అంతకు ముందు పవన్ కల్యాణ్‌కు హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్,ఎస్పీ సుబ్బరాయుడు, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ స్వాగతం పలికారు.కురుఫ్ ఆడిటోరియంలో ఆయనకు షార్ డైరెక్టర్ చంద్రయాన్-3 రాకెట్ నమూనాను, ఉపగ్రహాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసుల రెడ్డి,అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్, డిప్యూటీ డైరెక్టర్ టీఎస్ రఘురామ్, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తలు కానుకగా ఇచ్చిన చంద్రయాన్-3 శాటిలైట్ నమూనాను అబ్బురంగా చూస్తున్న పవన్‌కల్యాణ్

షార్‌లో వివిధ విభాగాల సందర్శన

షార్‌లో వివిధ విభాగాలను పవన్ కల్యాణ్ సందర్శించారు. లాంచ్‌ప్యాడ్, రాకెట్ అనుసంధానం చేసే పిఫ్ భవనంతో పాటు ఎంసీసీ భవనాన్ని ఆయన సందర్శించారు.అంతరిక్ష కేంద్రంలో ఉన్న విభాగాల గురించి పవన్‌కు శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా వివరించారు. షార్‌లోని విభాగాల సందర్శనానంతరం మధ్యాహ్నం 4.30 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని తిరుగుపయనమయ్యారు.



రాకెట్ ప్రయోగాల గురించి పవన్‌కు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

షార్ రోడ్డును ఐదు రోజుల్లో బాగు చేయిస్తాం!

తిరుపతి నుంచీ షార్ వెళ్ళే మార్గంలో బుచ్చినాయుడు కండ్రిగ నుంచీ షార్ వరకూ 17 కిలోమీటర్ల మేరకు రోడ్డును ఐదు రోజుల్లో బాగు చేయిస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఈ రోడ్డు బాగాలేదని షార్ అధికారులు తన దృష్టికి తెచ్చారని, వెంటనే తాను కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు మొదలు పెట్టించానన్నారు. మరో ఐదు రోజుల్లో పనులు పూర్తవుతాయన్నారు. ఇలాంటి పనులు చేపట్టే బాధ్యత తామే తీసుకుంటామన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పండుగలా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పుంగనూరు, చౌడేపల్లెల్లో జాతీయ జెండాలతో చేపట్టిన ర్యాలీ ● పలమనేరులో నిర్వహించిన ర్యాలీ

కుప్పం, ఆగస్టు 13: కుప్పం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ పండుగలా జరిగింది. మహిళా సంఘాలు, మెప్మా సిబ్బందితో, ప్రజలు అందరూ కలిసి మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో జాతీయ జెండాలు చేపట్టి ర్యాలీ జరిపారు. ఎమ్మార్ రెడ్డి సర్కిల్‌లో మానవ హారం ఏర్పాటు చేశారు. ర్యాలీని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. అలాగే కుప్పంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలల్లో హర్ ఘర్ తిరంగా వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఐఈవో సయ్యద్ మౌలా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మజీద్, ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్, వృత్తి విద్యా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎం.వాసుదేవరెడ్డి, ఎస్.జ్యోతి స్వరణ్, అధ్యాపకులు జగదీశ్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: పట్టణంలోని వెలుగు సంఘాల అధ్వర్యంలో ఏపీఎం రవి మహిళా సంఘాలు, విద్యార్థులతో కలసి జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో 100 అడుగుల జెండాతో పట్టణ పురవీధుల్లో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నానబాలకుమార్, నరసింహులు, నాగరాజులు పాల్గొన్నారు. ● శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు బైక్ ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: చౌడేపల్లెలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో పురవీధుల్లో 500 అడుగుల జెండాతో ర్యాలీ చేపట్టారు. బీజేపీ నాయకులు మదన్ మోహన్, కడియాల మనోహర్, గంధోడి ప్రవీణ్ కుమార్, గాలి ప్రవీణ్‌నాయుడు, లోకేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కుప్పం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మానవహారం

శాంతిపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు కిశోర్, బీజేపీ మండల అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల సచివాలయం ఆవరణలో, బస్టాండ్ సర్కిల్లోని జాతీయ రహదారిలో మానవహారం చేపట్టారు. ప్రతి ఇంటిపైన ఆగస్టు 15న జాతీయ జెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువత గజేంద్ర, గోపి, హరికుమార్, చంద్రశేఖర్, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి జాతీయ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల్లో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, మున్సిపల్ ఆర్ఓ రవిరెడ్డి, ఎంపీడీవో రాజేష్, బీజేపీ పట్టణ కన్వీనర్ తాతయ్య నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు మండీసుధా, రవి, మున్సిపల్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు

శాంతిపురం, ఆగస్టు 13 : మద్యం తాగి వాహనాలు నడిపిన మండలానికి చెందిన ఐదుగురికి కుప్పం కోర్టు న్యాయమూర్తి 3 రోజులు జైలు శిక్ష, రూ.5000 చొప్పున జరిమానా విధించారు. రాళ్లబూదుగురు ఎస్ఐ నరేష్ కథనం మేరకు.. మంగళవారం శాంతిపురం మండలం రాళ్లబూదుగురు సమీపంలోని కర్ణాటక సరిహద్దుల్లో వాహనాలను తనిఖీ చేపట్టారు. ఐదుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి కుప్పం కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు న్యాయమూర్తి శిక్ష విధించారు. వారిని చిత్తూరు సబ్ జైలుకు తరలించారు.

మురుగు కాలువల శుభ్రతకు ప్రణాళిక



కుప్పం, ఆగస్టు 13: మురుగు కాలువల శుభ్రతకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు హెచ్‌పీ రోడ్డులోని ప్రధాన మురుగు కాలువ పూడికతీత పనులను మంగళవారం ఆయన కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. వార్డులో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జిమ్ దాము, సోము, కస్తూరి వేలు, సెల్వరాజ్, ముస్లిం మైనారిటీ నాయకుడు జాకీర్ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 12 మంది ఎంపిక

కుప్పం, ఆగస్టు 13: కుప్పంలోని ఐఆర్ఎం కళాశాలలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 12 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ బీఎం.దయానిధి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనధికారిక లేఅవుట్లను ఆపాలి

కుప్పం, ఆగస్టు 13: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 25 వార్డులలో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులు వ్యవసాయ భూములలో వేస్తున్న అనధికారిక లేఅవుట్లను నిలిపేయాలని మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు వారు మంగళవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కౌన్సిలర్ జిమ్ దాము, సోమశేఖర్, బి.సురేశ్‌కుమార్, సెల్వరాజ్, కస్తూరి వేలు, ముస్లిం మైనారిటీ నాయకుడు జాకీర్ పాల్గొన్నారు.

గుడుపల్లెలో వైభవంగా ఉత్సవర్ల ఊరేగింపు



గుడుపల్లె, ఆగస్టు 13: మండల పరిధిలోని శిరిగిరిపల్లెలోని ప్రసన్న తిమ్మరాయస్వామి ఆలయ వార్షిక ఉత్సవాలల్లో భాగంగా మంగళవారం స్వామి వార్ల ఉత్సవర్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, రాళ్లగంగమ్మ, కుంటి గంగమ్మ, ద్రౌపది ఉత్సవర్లను పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఉత్సవాన్ని గుడుపల్లె పుర వీధుల్లో ఊరేగించారు. పచ్చగెరిగ, నయ్యాడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ఉత్సహంగా హర్ ఘర్ తిరంగా

గుడుపల్లె, ఆగస్టు 13: గుడుపల్లె పట్టణంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం మంగళవారం ఉత్సాహంగా జరిగింది. రైల్వే స్టేషన్ క్రాస్ నుంచి కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి జాతీయ జెండాతో రైల్వే గేటు వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ఎస్ తులసీనాథ్, కుప్పం నియోజికవర్గ బీజేపీ కన్వీనర్ డాక్టర్ శివశంకర్, కుప్పం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి డాక్టర్ నరేష్, మండల బీజేపీ అధ్యక్షులు టి. రామచంద్రుడు, జనసేన మండల అధ్యక్షులు అమీర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమష్టిగా ప్రజలకు సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

కుప్పం రూరల్, ఆగస్టు 13: కుప్పం ప్రజలకు కుల మతవర్గాలకు అతీతంగా సేవలు అందించాలని టీడీపీ కుప్పం రూరల్ మం డల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ పార్టీ వర్గాలకు పిలుపు నిచ్చారు. మండలంలోని అడవి బూదుగూరు పంచాయతీలో మంగళవారం టీడీపీ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు గణేశ్, కృష్ణమూర్తి, చిట్టిబాబు, మణి, రాధాకృష్ణమూర్తి, మేఘనాథన్, దిలీప్, మణి, చెన్నయ్య నాయుడు, రాధాకృష్ణ, శివకుమార్, రాజేంద్ర పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన

బైరెడ్డిపల్లె, ఆగస్టు 13 : తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం కోలార్ జాలప్ప ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. 55 మందికి కంటి పరీక్షలు జరిపి 15మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ పద్మావతి, ఆరోగ్య విద్యాధికారి కాంతమ్మ, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఎంపీహెచ్‌ఏ రాజారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ

కుప్పం రూరల్, ఆగస్టు 13: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అడవిబూదుగూరు పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు ఆనంద్‌ను మంగళవారం టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు మల్లానూరు ప్రేమ్‌కుమార్ పరామర్శించారు. పార్టీపరంగా అన్నివిధాలా ఆదుకుంటామని ఆయనకు భరోసా ఇచ్చారు.

జాతీయ పతాకాలతో బైక్ ర్యాలీ

వి.కోట, ఆగస్టు 13: హర్‌ఘర్ తిరంగా పేరిట బీజేపీ నేతలు వి.కోటలో జాతీయ జెండాలతో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షులు సోమశేఖర్, పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.

నేడు కడపల్లె గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

శాంతిపురం, ఆగస్టు 13 : మండల పరిధిలోని కడపల్లె వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రాజేంద్ర తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీలకు 22, బీసీలకు 2 సీట్లు, 6వ తరగతిలో ఎస్సీ-8, బీసీ-1, ఓసీ-1, 7వ తరగతిలో ఎస్సీ- 8, ఎస్టీ-1, 9వ తరగతిలో ఎస్సీ-25, ఓసీ కేటగిరికి- 1 చొప్పున సీట్లకు ఈ నెల 14వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు బుధవారం సాయంత్రం ఐదు గంటలలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

పుంగనూరు న్యాయమూర్తిగా కృష్ణవంశీ

పుంగనూరు రూరల్, ఆగస్టు13: పుంగనూరు కోర్టు న్యాయమూర్తిగా కె.కృష్ణవంశీని నియమిస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే చిత్తూరు క్రిమినల్ కోర్టులో అదనపు విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈయన విజయనగరం జిల్లా నుంచి రానున్నారు. కాగా ఇక్కడ పని చేస్తున్న న్యాయమూర్తి సింధు బదిలీపై వెళ్లారు.

రేపు సమైక్యతా ర్యాలీ

పలమనేరు, ఆగష్టు13 : పలమనేరులో ఈ నెల 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష కార్యదర్శులు సుబ్రమణ్యం, నరసింహులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీవో హోం నుంచి పురవీధుల్లో ఈ సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నివర్గాల ప్రజలు, విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొనాల కోరారు.

ఇంటింటా జాతీయ జెండా ఎగరాలి

కల్లూరు, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జండా ఎగరవేయాలని పాఠశాల హెచ్ఎం శ్రీవాణి, ఎన్‌జీసీ గ్రీన్ మాస్టర్ వెంకటసిద్ధులు, సీసీలు వాహిద్‌బాషా, తేజోవతి, పవనకుమారి తెలిపారు. పులిచెర్ల, కల్లూరు ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో పురవీధుల్లో జాతీయ జెండాను ఊరేగించారు. ప్లాస్టిక్ జండాలు వద్దని, కాగితపు జండాలే ముద్దని పిలుపునిచ్చారు.

రొంపిచెర్ల: ఈ నెల 15న ప్రతి ఇంటా జాతీయ పతాకం ఎగురవేయాలని ఎంపీడీవో రెడ్డెప్పఆచారి కోరారు. మంగళవారం రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయం నుంచి జాతీయ పతకాలతో పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవ హారం నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాసులు, ఏపీఎం హరినాథ్, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ డ్రిప్ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు, ఆగస్టు 13: సబ్సిడీ ధరలతో అందిస్తున్న డ్రిప్ పరికరాల కోసం ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాలకు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

స్కావెంజర్స్ వివరాలు నమోదు చేసుకోవాలి

శాంతిపురం, ఆగస్టు 13 : మండలంలో మాన్యువల్ స్కావెంజర్స్ ఎవరైనా ఉంటే మండల లేదా గ్రామ సచివాలయాల్లో బుధవారంలోగా పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో డాక్టర్ మైథిలి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

సంపులో పడిపోయిన చిన్నారిని రక్షించిన టీచర్

బైరెడ్డిపల్లె, ఆగస్టు 13 : ప్రమాదవశాత్తు సంపులో పడిపోయిన ఏడాదిన్నర వయసున్న చిన్నారిని ఉపాధ్యాయుడు శరవణన్ సకాలంలో రక్షించాడు. దేవదొడ్డి పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న శరవణన్ మంగళవాం పాఠశాల బయట విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో పాఠశాల సమీపంలో ఉన్న రఫిక్ ఇంటివద నుంచి గట్టిగా కేకలు వినిపించడంతో వెంటనే అక్కడికి వెళ్లాడు. ఆ ఇంటివద్ద నీటి సంపులో పాప పడిపోవడాన్ని గుర్తించి కాపాడాడు. చిన్నారి కుటుంబీకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈవోలు వేణుగోపాల్, సుబ్రమణ్యం, గ్రామస్తులు, సహచర టీచర్లు శరవణన్‌ను అభినందించారు.

ఘనంగా పాగేటి ఉత్సవం



ప్రత్యేక పల్లకీలో పాలేటమ్మ ఉత్సవమూర్తి

సోమల, ఆగస్టు 13: నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మవారి ఆలయంలో పాగేటి ఉత్సవం కోలాహలంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి భక్తులు జాగరణలతో అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయ సమీపంలోని బావి వద్దకు మంగళవాయిద్యాలతో ఊరే గింపుగా తీసుకెళ్లారు. అక్కడ జలాభిషేకం నిర్వహించి పాగేటి ఉత్సవం శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయం వద్దకు చేర్చి ఆసాదివారిచే కల్లుపాట చేపట్టారు. తర్వాత అమ్మవారి ఉత్సవమూర్తి పల్లకీలో ఆసీనురాలై చేసి బాణ సంచా వేడుకలు, డీజేల నడుమ ఊరేగింపుగా ఎగువపల్లెకు చేరారు. అక్కడ విశేషపూజలు నిర్వహించారు. ఉత్సవ ఉభయదారుడుగా గుట్ట చెంగల్ రాయప్ప వ్యవహరించారు. ఎగువపల్లె యూత్ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పుంగనూరు ఎన్జీవోల సమస్యలు పరిష్కరించాలి



చల్లాబాబును కలిసిన పుంగనూరు ఎన్జీవో నాయకులు

పుంగనూరు రూరల్ / రొంపిచెర్ల, ఆగస్టు13: పుంగనూరు నియోజకవర్గంలోని నాన్‌గెజిటెడ్ (ఎన్జీవో) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం రొంపిచెర్లలో ఉద్యోగ సంఘనాయకులు చల్లా బాబును ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ పుంగనూరులో ఎన్జీవో ఉద్యోగులకు శాశ్వతభవనం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘనాయకులు డాక్టర్ ఖాన్, మురళీబాబు, కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు ఎం.శ్రీకాంత్, సీవీరెడ్డి, వెంకటముని, మాధవరెడ్డి, పోలీసుగిరి, సుబ్రహ్మణ్యంరాజు, శమీపతి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● అలాగే ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది కలిసి సన్మానించారు.

తిరుమల నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ



కూరగాయలను పంపుతున్న జడ్పీటీసీ శ్రీనివాసులు

శాంతిపురం, ఆగస్టు 13 : శాంతిపురం మండలం జడ్పీటీసీ శ్రీనివాసులు మిత్ర బృందం మంగళ వారం తిరుమల నిత్యన్నదానానికి 10 టన్నుల కూరగాయలను పంపించారు. కూరగాయలు వితరణ చేసిన బృందంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పగడాల సురేష్‌రెడ్డి, లోకనాథంరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రమేష్‌రెడ్డి, సోము, బాబు, బుజ్జి, గంగిరెడ్డి, హరిష్, తదితరులు ఉన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

కల్లూరు, ఆగస్టు 13: పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో ఉదయం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. వివిధరకాల పుష్పాలతో అలంకృతులైన స్వామి, అమ్మవార్లకు అర్చకులు అనంత కుమారాచార్యులు శాస్త్రోక్తగా కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సోమలలో జాతీయ పతాకం ఊరేగింపు

సోమల, ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమల స్వయం సహాయ సంఘాల మహిళలు భారీ ర్యాలీ జరిపారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి సోమల బస్టాండ్ వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు. భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శివ, సీసీలు గంగోజీ, నరసింహులు, సంఘ మిత్రలు నారాయణ, శాంతమ్మ, సునీత, కృష్ణయ్య, సురేఖ, కుమారి తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక కేవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు దేశ భక్తి గేయాలపై పోటీలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు, అధ్యాపకులు గౌతం, శివయ్య పాల్గొన్నారు.

నేటిలోపు సఫాయి కర్మచారి సర్వే పూర్తి

పుంగనూరు రూరల్, ఆగస్టు13: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలో ఈ నెల 14తేదీ లోపు సఫాయి కర్మచారి సర్వే పూర్తి చేయనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని మ్యాన్యువల్ స్కావెంజర్స్ ఇన్ శానిటరీ లెట్రిన్ల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి సర్వే వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు, ఆగస్టు13: పుంగనూరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పదవికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ పదవికి ఏడేళ్ల అనుభవం ఉండాలని, ఎంపికైన న్యాయవాదికి మూడేళ్ల కాలపరిమితి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన న్యాయవాదులు వారంలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రందించాలని ఆయన కోరారు.

సికింద్రాబాద్‌కు బయలుదేరిన ఎమ్మార్పీఎస్ నాయకులు

పుంగనూరు రూరల్, ఆగస్టు13: తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో జరగనున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ ర్యాలీకి పుంగనూరు ఎమ్మార్పీఎస్ నాయకులు బయలుదేరి వెళ్లారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, నాగభూణం, వెంకట్రమణ, ప్రభాకర్, హరిబాబు, గోవిందు, రామనాథం, ప్రకాశ్, ప్రభు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎస్కే



చౌడేపల్లె, ఆగస్టు13: సీఎం చంద్రబాబును బోయకొండ మాజీ చైర్మన్ ఎస్కే వెంకట రమణారెడ్డి మంగళవారం అమరావతిలో కలిశారు. పుంగనూరు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు ఎస్కే తెలిపారు.

చల్లాను కలసిన తహసీల్దార్ హనుమంత్‌నాయక్



చౌడేపల్లె, ఆగస్టు13: పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని తహసీల్దార్ హనుమంత్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయనను కలసి శాలువలతో సత్కరించారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

చౌడేపల్లె, ఆగస్టు13: చెత్త నుంచి సంపద తయారీపై సర్పంచ్‌లకు, కార్యాదర్శులకు ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణవేణి రెండవరోజు శిక్షణ ఇచ్చారు. మంగళవారం ఆమె యల్లకుంట్ల పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌వద్ద చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఇచ్చారు.

సీఐ కృష్ణారెడ్డికి సన్మానం

చౌడేపల్లె, ఆగస్టు13: చిత్తూరుకు బదీలిపై వెళుతున్న పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డిని మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది శాలువలతో సన్మానించి వీడ్కోలు పలికారు.

మిథున్‌రెడ్డిని అరెస్టు చేయాలి



సీఎం చంద్రబాబును కలిసిన సుహేల్‌బాషా

పుంగనూరు, ఆగస్టు13: పుంగనూరులో టీడీపీ శ్రేణులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయించి ప్రశాంత వాతావరణం కల్పించాలని సీఎం చంద్రబాబుకు పుంగనూరు మైనార్టీ యువనేత ఎస్.సుహేల్‌బాషా విన్నవించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో సీఎంను కలిసి పుంగనూరులో జరుగుతున్న రాజకీయ అంశాలను వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తనపై రెండు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించారని వాపోయారు. వైసీపీ పాలనలో ముస్లిం మైనార్టీలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారని, ప్రస్తుతం మళ్లీ పోలీసు కేసులతో ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. బాధితులుగా తాము పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టినా ఇంతవరకు పెద్దిరెడ్డి కుటుంబీకులను అరెస్ట్ చేయలేదని తెలియజేశారు. త్వరలోనే అన్నింటిపై చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట రాజంపేట పార్లమెంట్ మైనార్టీ ఉపాధ్యక్షుడు సద్దాంహుసేన్, నదీమ్, తాజుద్దీన్, వినయ్ ఉన్నారు.

తమిళనాడు బియ్యం స్వాధీనం



బియ్యంతో పట్టుబడ్డ వాహనం

కుప్పం, ఆగస్టు 13: కర్ణాటకకు అక్రమంగా రవాణా అవుతున్న తమిళనాడు ప్రభుత్వ ఉచిత ఉప్పుడు బియ్యాన్ని కుప్పం అర్బన్ పోలీసులు సీజ్ చేశారు. స్థానికుల కథనం మేరకు.. తమిళనాడునుంచి మల్లానూరు మీదుగా మంగళవారం కుప్పంలోకి ఒక ఈచర్ వాహనం ప్రవేశించింది. కుప్పం పట్టణం బైపాస్ రోడ్డు హోండా షో రూం సమీపంలో టైరు పంక్చరైంది. డ్రైవర్ మరమ్మతులకు దిగాడు. ఆ సమయంలో బియ్యం అక్రమ రవాణా అవుతోందని స్థానికులకు సమచారం అందింది. వారు అక్కడికి చేరుకుని వాహనం తలుపులు తెరచి చూడగా అందులో సుమారు ఆరేడు టన్నుల తమిళనాడు బియ్యం బస్తాలు కనిపించాయి. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

బయటపెట్టని అధికారులు:

వాహనంలోని బియ్యం పరిణామాన్ని తేల్చడానికి సాయంత్రం 7 గంటలదాకా కూడా రెవెన్యూ యంత్రాంగంలో ఒక్కరు కూడా వాహనం దగ్గరకు వెళ్లలేదు. ఈ మధ్యలో అటు పోలీసులకు, ఇటు రెవెన్యూ యంత్రాంగానికి అనేక ఒత్తిళ్లు వచ్చినట్లు తెలిసింది. చివరకు రాత్రి బాగా పొద్దుపోయాక వాహనం వద్దకు రెవెన్యూ సిబ్బంది చేరుకున్నారు. అయితే అందులో తరలుతున్న బియ్యం పరిమాణం మాత్రం ఎంతన్నది బయట పెట్టలేదు. దీనిపై డీటీ దేవరాజులును వివరణ కోరగా ఇంకా కొలత వేయలేదని తెలియజేశారు.

ప్రభుత్వం ఏదైనా ఇక్కడింతే..!

నిజానికి అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా కుప్పం మీదుగా తమిళనాడునుంచి అక్కడి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే బియ్యం కర్ణాటకకు రవాణా అవుతూనే వస్తోంది. ఈ బియ్యం అక్కడ గుర్తుపట్టని రీతిలో పాలిష్ అయి, తిరిగి ఆంధ్రాకు చేరుకుంటోంది. రీటైల్‌గా కిలో బియ్యం రూ.35 నుంచి రూ.50 దాకా ధరపెట్టి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఘనంగా తిరంగా వేడుకలు

బైరెడ్డిపల్లె/ రామకుప్పం, ఆగస్టు 13 : బైరెడ్డిపల్లెలో మండల మహిళాసమాఖ్య, డీఆర్డీయే ఆధ్వర్యంలో మంగళవారం తిరంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, తహసీల్దార్ మాధవ రాజు, వెలుగు ఏపీఎం లలిత, ఎంఈవో సురేష్ బాబు, సీసీలు వసంత, ఉమ పాల్గొన్నారు. ● రామకుప్పంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, ఆంజినేయప్ప, వెంకటేశ్, జనసేన మండల అధ్యక్షుడు హరీష్, టీడీపీ నాయకులు తిరంగా వేడుకలు చేపట్టారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య



సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, ఆగస్టు13: కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పుంగనూరులో మంగళవారం వెలుగు చేసింది. ఎస్ఐ సుబ్బారెడ్డి కథనం మేరకు.. పట్టణ సమీపంలోని పెద్దిరెడ్డి కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యంతో మంగళం కాలనీకి చెందిన అరుణకు వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. సుబ్రహ్మణ్యం మేస్త్రీ. ఇతడు మద్యానికి బానిసయ్యాడు. దీనిపై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో సోమవారం ఉదయం భర్తతో గొడవ పడిన అరుణ పుట్టింటికి వెళ్లింది. సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చిన భర్త మనోవేదనతో ఇంట్లోనే చీరతో ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం 8గంటలకు కూడా అతడు ఇంటి నుంచి బయట రాకపోవడంతో చుట్టుపక్కల వారు భార్యకు సమాచారం ఇచ్చారు. ఇంటి తలుపులు బద్దలు కొట్టిచూడగా ఉరేసుకుని ఉన్నాడు. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

పెన్షన్ మంజూరయ్యే వరకూ వికలాంగునికి సాయం



ఆర్థికసాయమందిస్తున్న యుగంధర్

వెదురుకుప్పం, ఆగస్టు 13: సేవే లక్ష్యంగా పనిచేస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న అన్నారు. మంగళవారం కాపు మొండివెంగనపల్లెలో వైసీపీ ప్రభుత్వ హయంలో నుంచి వికలాంగ పెన్షన్ అందని పెద్దబ్బరెడ్డిని జనసైనికులతో కలసి పరామర్శించారు. పార్టీ తరఫున రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఇతనికి ప్రభుత్వం తరఫున పెన్షన్ మంజూరయ్యే వరకూ ప్రతీ నెల రూ.5వేలు తమ పార్టీ తరఫున అందిస్తామని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు పురుషోత్తం, ఉపాధ్యక్షుడు నలిపిరెడ్డి మధు, మునిరత్నంశెట్టి, ప్రధానకార్యదర్శులు ముని,బెనర్జీ పాల్గొన్నారు.

రేపు,ఎల్లుండి పెద్ద దర్గాలో ఉరుసు మహోత్సవం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 13: పలమనేరు రోడ్డులోని హజరత్ సయ్యద్ రసూల్‌బాబా పెద్ద దర్గాలో ఈనెల 15, 16 తేదీల్లో ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం గంధోత్సవం, 16న ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నామన్నారు.

యుద్ధ ప్రాతిపదికన కల్వర్టుకు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

నగరి ఆగస్టు13: కన్నికాపురం వద్ద వర్షానికి దెబ్బతిన్న కల్వర్టు పనులను ఎంఎల్ఏ గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న కల్వర్టును టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో మంగళవారం బాగు చేయడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. 24 గంటల లోపే మరమ్మతులు పూర్తి కావడంతో స్థానికులు ఎంఎల్ఏకు, టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపీడీవో



విజయపురం, ఆగస్టు 13: పన్నూరు, జగన్నాథపురం సచివాలయాలను మంగళవారం ఎంపీడీవో రమణప్రకాష్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించా సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మెరుగు పరచాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

విజయపురం, ఆగస్టు 13: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిప్యూటీ డీఈవో ప్రభాకర్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం జంబాడ, శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలను సందర్శించారు. శ్రీహరిపురంలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. జంబాడలో పదవ తరగతి విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. సోమశేఖర్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిపాల పీహెచ్‌సీ తనిఖీ

గుడిపాల, ఆగస్టు 13: స్థానిక పీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌వో ప్రభావతి తనిఖీ చేశారు. పేషంట్లకు అందుతున్న సేవలపై ఆమె ఆరా తీశారు. అనంతరం పాపసముద్రంలో 104 కార్యక్రమాన్ని తనిఖీ చేసి, గర్భవతులకు ప్రత్యేకంగా బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు తప్పకుండా చేయించాలని ఆదేశించారు. వైద్యాధికారులు సంధ్య, శిరీష, చంద్ర మహేష్, వైద్య సిబ్బంది విజయ, చంద్రశేఖర్, రుక్మిణి, కవిత పాల్గొన్నారు.

బయట వారికి టెండర్లు ఇవ్వొద్దు: సీఐటీయూ

చిత్తూరు రూరల్, ఆగస్టు 13: విద్యుత్ శాఖలోని జిల్లా స్టోర్స్‌లో హమాలీ కాంట్రాక్టును బయట వ్యక్తులకు ఇస్తే సహించేది లేదని సీఐటీయూ,ఏపీ డిస్టిక్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో బయట వ్యక్తులకు కాంట్రాక్టు ఇవ్వడంపై మంగళవారం స్థానిక జిల్లా స్టోర్స్ ఎదుట నిరసన వారు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలా బయట వ్యక్తులకు కాంట్రాక్టు ఇస్తే గతంలో ఉన్న హమాలీలను కాదని వారు ఇష్టం వచ్చినవారిని నియమించుకునే అవకాశం ఉందన్నారు. సీఐటీయూ, అసోసియేషన్ నాయకులు గంగరాజు, సరేంద్రన్, శివ, ఆనంద, గంగాధర, హరివేలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలను పరిష్కరిస్తాం : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13: పీఎఫ్ ఖాతాదారుల సమస్యలకు త్వరలో శాశ్వత పరిష్కారాన్ని కల్పిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఎస్టీయూ, యూటీఎఫ్ సంఘ నాయకులు వేర్వేరుగా ఆయనను కలిశారు. టీచర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్ జాబితా తయారీకి విద్యాశాఖ సిబ్బందితోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన టీచర్ల సహకారం ః తీసుకుంటామన్నారు. రివర్షన్ కోరుతున్న టీచర్లకు న్యాయం చేస్తానని హామీయిచ్చారు. హైస్కూల్ ప్లస్ టీచర్లకు ఇంక్రిమెంట్ల మంజూర్లు, ఆర్థిక ప్రయోజనాల వర్తింపుల్లో ఎదురౌతున్న సమస్యలపై ఖజానాశాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. యూటీఎఫ్ సంఘనాయకులు కలెక్టర్‌ను వేరుగా కలిసి వినతి పత్రం అందజేశారు.

వైసీపీ పాలనలో గుడినీ బడినీ దోచుకున్నారు: థామస్



జెండా ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్

శ్రీరంగరాజపురం, ఆగస్టు 13: వైసీపీ ప్రభుత్వంలో గుడిని బడిని దోచుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ విమర్శించారు. మంగళవారం గంగమ్మగుడి దేవస్థానంలో ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో బాగున్న గుడిని తొలగించి కొత్త నిర్మాణం పేరుతో దోచుకున్నారన్నారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని చూపిస్తే, పరిశ్రమలు తీసుకు రావడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, ధనుంజయ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, బాలాజీ నాయుడు, రాజశేఖర్ నాయుడు. సిద్దయ్యశెట్టి, పూజారి నాగరాజు, కుమార్, హేమాద్రి పాల్గొన్నారు. కాగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన 49 కొత్తపల్లెమిట్టకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గంగాధరనెల్లూరు: స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు ఎమ్మెల్యే థామస్ పుస్తకాలను పంపిణీ చేశారు. బీజేపీ సహకారంతో గంగాధరనెల్లూరులో జరిగిన జాతీయ పతాక ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. 50 అడుగుల జెండాతో హైస్కూల్ నుంచి బస్టాప్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యురాలు దుర్గారామక్రిష్ణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, వెంకటేష్, దేవసుందరం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు కంటిపరీక్షలు



చిత్తూరు, ఆగస్టు 13: నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం కార్మికులకు మంగళవారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి చికిత్సలు చేయించారు. ఈ నెల 2, 3 తేదీల్లో కార్మికులందరికి పరీక్షలు నిర్వహించారు. 19 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి తాజాగా పరీక్షలు చేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి సహాయ సహకారాను అందిస్తామని కమిషనర్ అరుణ తెలిపారు. సంబంధిత వైద్యులు, అధికారులతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

26 నుంచి కృష్ణ జయంత్యుత్సవాలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 13: స్థానిక చర్చివీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి సెప్టెంబరు 1 వరకు కృష్ణ జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయట్రస్టీ టీజీ. బుల్లెట్ సురేష్ తెలిపారు. 26న గోకులాష్టమి, మహాభిషేకం, 27న కృష్ణ జయంతి, 28న కల్యాణోత్సవం, 29న భజన, 30న ఉదయం అన్నదానం, సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, 31న పుష్ప పల్లకి సేవ, సెప్టెంబరు 1న ఉట్టి మహోత్సవం నిర్వహిస్తున్నామని వివరించారు.

18 నుంచి గీతా జ్ఞానయజ్ఞం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 13: వేలూరు రోడ్డులోని సద్గురు సేవాశ్రమములో ఈనెల 18 నుంచి 24 వరకు గీతా జ్ఞానయోగం నిర్వహిస్తున్నామని ఆశ్రమ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మిక ప్రబోధకురాలు శ్రేయానంద సరస్వతి చిన్మాయనంద రోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు భగవద్గీతలోని కేనోపనిషత్తు, సాయంత్రం జ్ఞానయోగాలను వివరిస్తారన్నారు.

వైభవంగా విరుపాక్షమ్మ జాతర



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 13: గొడుగుమూరులో ఆడిమాసం చివరి మంగళవారం సందర్భంగా విరుపాక్షమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహా నైవేద్యం సమర్పించి జంతుబలులు ఇచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. సంతపేట చవటపల్లెలో ఆడిమాస విరుపాక్షమ్మ జాతర నిర్వహించారు. అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమాల్లో జ్యోతిష్యులు సత్యనారాయణ స్వామి , దేవరాజుల రెడ్డి, రఘునాథరెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాంబకు రూ. 2.97లక్షల ఆదాయం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 13: గిరింపేట దుర్గాంబ అమ్మవారికి హుండీ ద్వారా రూ.2.97 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో మునిశేఖర్ తెలిపారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యంనాయుడు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించామన్నారు. వరలక్ష్మి వ్రతం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

బంగారుపాళ్యం, ఆగస్టు 13: శెట్టేరి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శేషాపురం గ్రామానికి చెందిన చరణ్ మంగళవారం సొంత నిధులతో విద్యాసామగ్రిని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపి నాయుడు, గిరి నాయుడు, ఉపాధ్యాయులు విశ్వ, నితిన్ పాల్గొన్నారు.

17న గిరిజన యువతకు జాబ్ మేళా

చిత్తూరు, ఆగస్టు 13: జిల్లాలోని నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ అధికారి మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అమెజాన్ ఆధ్వర్యంలో వేర్‌హౌస్ అసోసియేట్స్, ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ తదితర విభాగాలలో పనిచేయాల్సిన ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.17వేల నుంచి రూ. 19వేల వరకు జీతంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు ఉంటాయన్నారు. పొన్నేరి, గుమ్మడిపూండి ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉందన్నారు. ఆసక్తి కలిగిన వారు కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో జరిగే జాబ్ మేళాకు హాజరవ్వాలని కోరారు.

10 స్కూల్ బస్సులపై కేసు నమోదు

చిత్తూరు సిటీ, ఆగస్టు13: నిబంధనలు పాటించని పాఠశాల, కళాశాల బస్సులపై చర్యలు తప్పవని డీటీసీ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు పాఠశాల, కళాశాల బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నిబంధనలు పాటించని 10 బస్సులపై కేసు నమోదు చేసి, రూ.1.18 లక్షలు అపరాధ రుసుము వసూలు చేసినట్లు చెప్పారు. ఆటోల్లో పరిమితికి మించి పిల్లలను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

భాషా పండితులకు పదోన్నతి కల్పించాలి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 13: డీఈవో పూల్‌లోని భాషా పండితులకు పదోన్నతి కల్పించాలని ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం మంగళవారం ఏపీ సెక్రటేరియేట్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో అంబేడ్కర్ ఫోటోలు పెట్టేలా చూడాలన్నారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇప్పించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించిన వారిలో సంఘం నాయకులు పురుషోత్తం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ముందస్తు పంద్రాగస్టు వేడుకలు





నగరిలో 600 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ- పాలసముద్రంలో జెండాలతో కదిలిన డ్వాక్రా మహిళలు

నగరి ఆగస్టు13: పట్టణంలో హర్ ఘర్ తిరంగాలో భాగంగా మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పార్టీ మహిళా మోర్చా నాయకురాలు నిషిధరాజు దీనిని ప్రారంభించారు. టవర్ క్లాక్ వద్ద పిరమిడ్ ఏర్పాటు చేసి జాతీయ పతాకానికి వందనం చేశారు. 600 అడుగుల జాతీయ పతాకంతో 300 మంది విద్యార్థులులో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐ సురేష్‌నాయుడు, నాయకులు లక్ష్మీవర్మ, మణివణ్ణన్, వంకర్ రామ్మూర్తియాదవ్, పొన్నప్ప, సౌందర్యపాండి, రాము, మణి, పుష్ప లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలకేంద్రం నుంచి పాలసముద్రం వరకు డ్వాక్రా మహిళలు మంగళవారం జాతీయజెండాతో ర్యాలీ నిర్వహించారు. పాలసముద్రం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు తమ కళాశాల నుంచి బీసీ కాలనీ వరకు ర్యాలీ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ హేమలత, అధ్యాపకులు సుశీల, శోభ, ఏపీఎం ఫరీద్ మస్తాన్, వెలుగు సీసీలు మురగయ్యపాల్గొన్నారు.

గుడిపాల: సావర్కర్ ట్రస్టు ప్రెసిడెంట్ దేవరాజన్, మండల బీజేపీ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, యూత్ ప్రెసిడెంట్ మధు ఆధ్వర్యంలో బొమ్మసముద్రం నుంచి గుడిపాల వరకు జాతీయ పతాకాలతో మోటర్ బైకులతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు సాయి, ప్రతాప్, సెల్వం, పీటర్, స్టాలిన్, సతీష్ పాల్గొన్నారు.



బొమ్మసముద్రం నుంచి సావర్కర్ ట్రస్టు ఆధ్వర్యంలో ర్యాలీ

జిల్లాలో అధికారుల సహకారం మరువలేనిది: జేసీ



జేసీ శ్రీనివాసులును సన్మానిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13: జిల్లాలో పనిచేయడం తనకెంతో ఆనందంగా ఉందని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో అధికారులందరూ సహకరించారని జేసీ శ్రీనివాసులు అన్నారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న ఆయనకు జిల్లా యంత్రాంగం తరఫున మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం కలెక్టరేట్‌లో జరిగింది. జేసీని పలువురు శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. జేసీ కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మండల స్థాయి అధికారుల సమన్వయంతోనే సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, భూసమస్యల పరిష్కారం, తప్పుల్లేని ఓటరు జాబితా తయారీ తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించగలిగామన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో జేసీ చురుగ్గా ఉంటూ ఉత్తమమైన ప్రతిభ కనబరిచారన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, పలువురు ఆర్డీవోలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



హర్షవర్ధన్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

గంగాధరనెల్లూరు, ఆగస్టు 13: అప్పిరెడ్డికండిగ వద్ద ఈచర్ వ్యాన్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. వివరాలివి.. శ్రీరంగరాజుపురం మండలం కొత్తపల్లెమిట్టకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, ప్రమోద్, ఆకాష్‌లు సోమవారం అర్ధరాత్రి కారులో చిత్తూరు బయలుదేరారు. గంగాధరనెల్లూరు మండలం అప్పిరెడ్డికండిగ బస్టాప్ సమీపానికి కారు వచ్చేసరికి ముందున్న ఈచర్ వ్యాను డ్రయివర్ మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయాడు. ఈ సందర్భంలో ఎలాంటి సిగ్నల్ ఇవ్వకపోవడంతో వెనుక ఉన్న కారు వ్యాన్‌ను ఢీకొంది. డ్రైవింగ్ చేస్తున్న ప్రమోద్, హర్షవర్ధన్‌రెడ్డి, ఆకాష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్ల సలహా మేరకు రాణిపేట సీఎంసీకి తరలించారు. హర్షవర్ధన్‌రెడ్డి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి మునికన్నారెడ్డి ఫిర్యాదు మేరకు గంగాధరనెల్లూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్ విండో సొసైటీల్లో డిజిటలైజేషన్ వేగవంతం :కలెక్టర్



అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్

గంగాధరనెల్లూరు, ఆగస్టు 13: సింగిల్‌విండో సొసైటీల్లో రైతుల రికార్డుల వివరాలను వేగంగా డిజిటలైజేషన్ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ డీసీసీబీ, సింగిల్‌విండో అధికారులను ఆదేశించారు. స్థానిక సింగిల్ విండో సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఆయన డిజిటలైజేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. డీసీసీబీ సీఈవో మనోహర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 30,150మంది వివరాలు డిజిటలైజ్ చేశామన్నారు. డీజీఎం వెంకటాచలపతి, అప్కాబ్ (డీపీడీఎం) సీనియర్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మహేష్‌చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వెస్ట్ సర్కిల్ ఆఫీస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

చిత్తూరు, ఆగస్టు 13: చిత్తూరు వెస్ట్‌సర్కిల్ పోలీసు కార్యాలయాన్ని మంగళవారం ఎస్పీ మణికంఠ తనిఖీ చేశారు. ఆఫీస్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, కేసుల దర్యాప్తుతో పాటు క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, వెస్ట్ సర్కిల్ సీఐ శ్రీధర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దేశభక్తిపై వ్యాసరచన పోటీలు

యాదమరి, ఆగస్టు 13: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికే వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించినట్లు సోషల్ స్టడీస్ టీచర్ మదన్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కె.గొల్లపల్లె జడ్పీ హైస్కూల్‌లో హర్‌ఘర్ తిరంగా అభయాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. టీచర్లు చిన్నదురై, రాజరాజేశ్వరి, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులకు రూ.9.77కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా

గంగాధరనెల్లూరు, ఆగస్టు 13: ఉపాధి హామీ పథకం ద్వారా రూ.9.77 కోట్లు ఖర్చు చేసినట్లు డ్వామా జిల్లా అడిషనల్ పీడీ ఉమావాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా 1921 పనులకు రూ.6.56 కోట్లు, పంచాయతీరాజ్‌శాఖ ద్వారా 70పనులకు రూ.3.15కోట్లు, హౌసింగ్‌శాఖ ద్వారా 61పనులకుగాను రూ.2.36 లక్షలు, వెటర్నరీశాఖ ద్వారా రూ.2.52లక్షలు వెచ్చించామన్నారు. ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, జిల్లా విజిలెన్స్ అధికారి గంగాభవాని, ఏపీడీ సుబ్రమణ్యం, ఇన్‌చార్జి ఎంపీడీవో రాఘవేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ అమానవీయం: ఎస్పీ మణికంఠ



మణికంఠను సన్మానిస్తున్న అపోలో యాజమాన్య ప్రతినిధులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 13: ర్యాగింగ్ అనేది మానవతకడు వ్యతిరేకమ జిల్లా ఎస్పీ మణికంఠ అన్నారు. మంగళవారం అపోలో యూనివర్సిటీలో యాంటీ ర్యాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్పీ హాజరయ్యారు. ర్యాగింగ్ చట్టరిత్యా నేరమన్నారు. మరణానికి కారణమైనా, ఆత్మహత్యకు ప్రేరేపించినా జీవిత ఖైదు పడుతుందన్నారు. జూనియర్లను సీనియర్లు ప్రోత్సహించాలే తప్ప ర్యాగింగ్ చేయకూడదని చెప్పారు. అనంతరం ఆయన్ను అపోలో యాజమాన్యం సత్కరించారు. వైస్‌ఛాన్సలర్ వినోద్‌బట్, డీన్ ఆల్ఫ్రెడ్ ఆగస్టిన్, అపోలో యూనిట్ హెడ్ నరేష్ రెడ్డి, రిజిస్ట్రార్ పోతరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కమ్మ సంఘం ప్రతినిధులు



పాలసముద్రం, ఆగస్టు 13: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మంగళవారం అమరావతిలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, బెంగళూరు కమ్మ సంఘం అధ్యక్షుడు రాజగోపాల్ నాయుడు, ప్రతినిధులు రుక్మాంగథ నాయుడు, యాగమూర్తి నాయుడు, రమణబాబు, రాజేంద్రనాయుడు, లోకనాథనాయుడు, ఎమ్మెల్యే మురళీమోహన్ కలిశారు. సీఎంను వారు ఈసందర్భంగా సన్మానించారు.

సహకార సంఘంలో ఓటుకు కేవైసీ చేసుకోండి

పెనుమూరు, ఆగస్టు 13: వ్యవసాయ సహకార సంఘంలో ఎన్నికల్లో ఓటు హక్కు కొనసాగించడానికి కేవైసీ తప్పని సరిగా చేసుకోవాలని గుంటిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో మురుగన్ తెలిపారు. మంగళవారం ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఆధార్‌కార్డు, పట్టాదార్ పాసుపుస్తకం, బ్యాంకు పుస్తకం జిరాక్స్ ఈనెల 30లోపు అందించాలన్నారు.

శ్రీరంగరాజపురం: సహకార సంఘాల ఎన్నికల్లో ఓటు వినియోగంపై శ్రీరంగరాజపురంలో సహకార సంఘం సీఈవో రాజారెడ్డి రైతులకు అవగాహన కల్పించారు.

బంగారమ్మకు కూరగాయల అలంకరణ

వెదురుకుప్పం, ఆగస్టు 13: కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మను మంగళవారం కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

విజయపురం, ఆగస్టు 13: తహసీల్దార్ కిరణ్‌ను మండల టీడీపీ నాయకులు మంగళవారం మర్యాదపూరకంగా కలిసి సత్కరించారు. అనంతరం మండల వైసీపీ నాయకులు సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, ఎంపీటీసీ రాజగోపాల్ తదితరులు కలిసి సత్కరించారు. మండల టీడీపీ నాయకులు దశరథరాజు, ప్రకాష్, రామచంద్రారెడ్డి, హరికృష్ణా, బాలసుబ్రహ్మణ్యం, మునిశేఖర్ శెట్టి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా చంద్రశేఖర్

పూతలపట్టు, ఆగస్టు 13: పూతలపట్టు ఇన్‌చార్జి ఎంపీడీవోగా చంద్రశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ప్రసన్న కుమారి బదిలీపై నెల్లూరుకు వెళ్ళడంతో, ఎంపీడీవో కార్యాలయంలో ఏవో చంద్రశేఖర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

ఈనెల 16న వరలక్ష్మి వ్రతం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 13: నగరంలోని వైష్ణవాలయాల్లో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నారు. కోదండరామాలయం, వెంకటేశ్వరాలయం, కట్టమంచి వరదరాజస్వామి, సంతపేట, విజయలక్ష్మి కాలనీ రంగనాథస్వామి, దుర్గానగర్ కాలని సిద్ధివినాయక, పొన్నియమ్మ, షిర్డి సాయిబాబ ఆలయాల్లో వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నారు.

పేదలకు అన్నదానం

గుడిపాల, ఆగస్టు 13: మండల కేంద్రంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో దాతల సహకారంతో మంగళవారం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు హేమాద్రి నాయుడు, హరిప్రసాద్, కనకనేరి రవి, రవి నాయుడు, సుబ్రహ్మణ్యం, బాబు, చల్లా పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి

బంగారుపాళ్యం, ఆగస్టు 13: మండలంలోని నలగాంపల్లి అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఈమె మృతికి పలువురు నివాళులర్పించారు.